# వ్యాపారం

-ఉమాదేవి

మూడు సంవత్సరాల నుండి పని చేస్తున్న బ్రాంచీలో ఆ రోజు రిలీవ్ అయిపోయాను. కొత్త బ్రాంచీలో ఓ వారంరోజులలో చేరవలసి ఉంది. నేను చేరవలసిన బ్రాంచి అదే జోన్‌లో ఉంది. కాకపోతే రెండు వందల కిలోమీటర్ల దూరం.

పేకర్స్ సామాన్లు పేక్ చేస్తూ ఉండడంవల్ల ఇల్లంతా రద్దీగా ఉన్న రైల్వే ప్లాట్‌ఫారంలా ఉంది. పూజ గదిలోని సామాన్లు, దేవుళ్ల విగ్రహాలను శ్రీమతి స్వయంగా సర్దుకుంటోంది. సామానులన్నీ ఆ మర్నాడు లారీకి ఎక్కించేయాలి.

ప్యాక్ చేయబడిన సామాన్ల మధ్యన ఫోల్డింగ్ ఛైర్ వాల్చుకుని కాఫీ చప్పరిస్తూ ఆ రోజు దినపత్రిక తిరగేస్తూ కూర్చున్నాను. పేకర్లు చేస్తున్న పనిని తాత్కాలికంగా ఆపి టీ తాగడానికి బయటకు వెళ్లారు. ఇంతలో వరహాల్రాజు ఆదరాబాదరాగా లోపలకు వచ్చాడు. అతని చేతిలో ఏదో గిఫ్ట్ పేకట్ ఒకటి ఉంది.

“అయ్యగారూ! మీరు రేపే వెళ్లిపోతున్నారని విని ఇలా వచ్చాను'' అన్నాడు ఎదురుగా నిలబడి.

సైకిల్ జోరుగా తొక్కుకుంటూ రావడంవల్ల కాబోలు అతని మాటల్లో అలసట స్పష్టంగా ధ్వనిస్తోంది.

“అవునండీ రేపు ఉదయం బయలుదేరుతున్నాం. ఎల్లుండి కొత్త మేనేజరుగారి కుటుంబం వస్తోంది. వాళ్లు ఈ ఇంట్లోనే దిగుతున్నారు'' అన్నాను అతడ్ని కూర్చోమని సైగ చేస్తూ.

అతడు కుర్చీలో రిలాక్స్‌గా కూర్చున్నా కూడా కొన్ని క్షణాలవరకు ఏం మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు.

ఏదో చెప్పడానికి సందేహిస్తున్నాడనిపించింది.

తర్వాత అతడే మాటలు ప్రారంభించాడు.

“మీ మాట చలువ వలన ఆయన కూడా ఇంటికి కావాల్సిన కిరాణా సామాన్లు నన్నే సప్లై చేయమన్నారు.''

“మాకు ఇచ్చినట్టే ఆయనకి కూడా నాణ్యమైన సరుకు పంపుతూ ఉండండి. మీ గురించి ఆయనతో మంచిగా చెప్పాను'' అన్నాను నవ్వుతూ.

“అమ్మమ్మ... మీ బోటి వారికి రెండోరకం ఇస్తానా? నామీద అభిమానంతో మీరు సిఫార్సు చేసారు. మీకు మాట రానిస్తానా? అయితే నాదో చిన్న విన్నపం అయ్యగారూ'' అన్నాడు కాస్త సందేహిస్తూ.

“చెప్పండి నా దగ్గర మీకు సందేహమెందుకూ?'' అన్నాను కుతూహలంగా అతన్ని చూస్తూ.

“ఏదో ఇంతకాలం మీ దయవలన కాస్తో కూస్తో లబ్ది పొందాను. ఉడతా భక్తిగా ఈ చిన్ని కానుక మీకు సమర్పించుకుందామని ఇలా వచ్చాను'' అంటూ చేతిలోని పేకట్ అందించబోయాడు.

నాకు అతను కానుక ఇవ్వడమేమిటో అర్థం కాలేదు. అదే మాట అన్నాను అతనితో.

“అయ్యయ్యో నాకెందుకండీ కానుకలు?'' అన్నాన్నేను.

“మీవలన లబ్ది పొందినవాడ్ని.''

“మేమేమీ ఉత్తినే సొమ్ము పోయలేదు కదా. సరుకులు తీసుకుని సొమ్ము చెల్లించే వాళ్లం. ఇంకా చెప్పాలంటే నాణ్యమైన సరుకు మాత్రమే కాకుండా ధర కూడా కాస్త తగ్గించే ఇచ్చేవారు. కాబట్టి ఇందులో మా గొప్పతనం ఏమీలేదు. మీరిలా కానుకలిచ్చి ఇబ్బంది పెట్టకండి'' అని వారించాను.

అతను నా మాటలు వినిపించుకునే ధోరణిలో లేనట్టే కనిపించాడు.

“అయ్యగారూ! మీలాంటివారి వద్ద దాపరికం ఎందుకు? చేసిన తప్పును చెప్పేస్తే కాస్తయినా దోషం పోతుందని ఇలా వచ్చాను. నన్ను మన్నించి దీనిని మీరు స్వీకరించాలి. ఇది కానుక కాదు జ్ఞాపిక మాత్రమే'' ప్రాధేయపడుతూ అన్నాడు.

అతడి వాలకం అంతుచిక్కడంలేదు. మాపట్ల అతడు చేసిన తప్పేమిటో అర్థం కావడంలేదు. అదే అతడితో అన్నాను.

“ఏం చెప్పమంటారు అయ్యగారూ! అయిస్కాంతంలా కస్టమర్లని ఆకర్షించాలన్నదే మా తాపత్రయం. కస్టమర్లను ఆకట్టుకోవడానికి అనేకమైన అడ్డదారులు తొక్కవలసి వస్తుంటుంది. అందులో మీలాంటి విఐపి కస్టమర్లని బుట్టలో వేసుకోవడానికి ఒక రూపాయో అర్థో మొదట్లో తగ్గించి సరుకుల్ని అమ్ముతాం. కాస్త గురి కుదిరిందని తెలుసుకున్నాక మొదట్లో తగ్గించినది కూడా కలిపి వసూలు చేసుకుంటాం. ఇది వ్యాపార నీతి. నీతిగానూ, నిక్కచ్చిగానూ ఉంటే ఓ నెల రోజుల్లో బోర్డు తిప్పేసుకోవాల్సిందే. ఎంత నమ్మకమైన వ్యాపారి అయినా తన లాభం వేసుకునే సరుకులు అమ్ముతాడు కాని నష్టం

భరిస్తూ అమ్ముకోడుకదా. దాసుని తప్పులు దండంతో సరి పెట్టాలి మరి. ఈ విషయాలు మీకు తెలియవని కాదు. ఏదో నా తృప్తి కోసం మీకు చెబుతున్నాను'' అంటూ రెండు చేతులూ పట్టుకున్నాడు.

ఏదో పెద్ద తప్పు చేసినట్లుగా చాలా భావిస్తూ చాలా బాధ పడుతున్నాడు.

అతడ్ని చూస్తుంటే జాలి కలిగింది. క్షణ కాలం ఆలోచనలో పడ్డాను.



అతడు చేసింది తప్పనిపించలేదు నాకు. విపరీతమైన పోటీ తత్వమున్న మార్కెట్లో నిలదొక్కుకుని వ్యాపారం సాగించాలంటే తప్పనిసరిగా ఎన్నో జిమ్మిక్కులు చేయక తప్పదు.


పెద్ద పెద్ద వ్యాపార సంస్థలే కోట్లుకోట్లు వెచ్చించి కస్టమర్లను బుట్టలో వేసుకోవడానికి తంటాలు పడుతున్నాయి. మా బ్యాంకులలో మాత్రం మేం చేయడంలేదూ? రిజర్వు బ్యాంకూ, బ్యాంకు అసోసియేషన్ల ఆంక్షలున్నప్ప టికీ కస్టమర్లని ఆకట్టుకోవడానికి ఎన్నో పక్కదారులు కనిపెడుతూనే ఉన్నారు. తన వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటూనే ఉన్నారు. దీనికోసం మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ వారు సాలీనా కోట్లుకోట్లు ఖర్చు చేస్తూనే ఉన్నారు.తన వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవడానికి ఇతను కనిపెట్టిన విధానం ఇది. అతడ్ని తప్పు పట్టనవసరంలేదనిపించింది.

నా ఆలోచనల్లో నేనుండగా ఎదురుగా కూర్చుని నా ముఖ కవళికలు చదవడానికి ప్రయత్నం చేస్తున్నాడు వరహాలరాజు.



# కాజల్ అదృష్టం

ఇంతకుముందున్న కాజల్ క్రేజ్ వేరు, 'మగధీర' హిట్‌తో మారిన కాజల్ ప్రస్తుత క్రేజ్ వేరు. ఈ సినిమా సూపర్‌హిట్ తర్వాత టాలీవుడ్‌లో తనదైన డిమాండ్‌ని పెంచుకుంటోంది కాజల్. అంతేకాదు, మంచి ఆఫర్లు కూడా ఆమె ఇంటి తలుపు తడుతున్నట్టు తెలుస్తోంది. పవన్ కల్యాణ్‌కి జంటగా నటించే చాన్స్ కాజల్‌ని వెతుక్కుంటూ వచ్చిందిప్పుడు. 'ఆంజనేయులు' తర్వాత పవన్ కల్యాణ్ హీరోగా గణేష్‌బాబు నిర్మించే చిత్రంలో నాయికగా కాజల్ నటించే అవకాశాలు ఎక్కువగా వున్నాయి అంటున్నారు సినీ జనాలు!




"ఇందులో మీరు నొచ్చుకోవాల్సింది ఏమీలేదు. ఎవరి వ్యాపార రీతి వారిది'' అన్నాను.

మార్కెటింగ్‌లో ఎమ్‌బిఏ చేసిన నేను, హైస్కూల్ అరుగెక్కని అతనూ ఒకే స్థాయిలో ఉన్నట్టనిపించింది.

"ఇది అమ్మగారికి ఇచ్చిపోతాను'' అన్నాడు లేచి నిలబడి.

అతడి వ్యాపార నీతిని నేను సమర్థించినందుకు అతడిలో ఉత్సాహం తొణికిసలాడుతోంది.

"తను లోపల సామాన్లు సర్దుకుంటోంది వెళ్లండి'' అని చెప్పి పేపరు చదవడంలో నిమగ్నమయ్యాను.

కొంతసేపయ్యాక చిరునవ్వుతో అతను లోపల నుండి రావడం గమనించాను.

"వస్తానయ్యగారూ. సాయంత్రం వచ్చి కలుసుకుంటాను'' అనేసి నా సమాధానం కోసం ఎదురుచూడకుండా చకచకా నడుచుకుంటూ వెళ్లిపోయాడు వరహాలరాజు.

అతడి చేతులు ఖాళీగా ఉన్నాయి. అంటే ఆ ప్యాకెట్‌ను మా ఆవిడకు ఇచ్చేసాడన్నమాట.

'అరె... మళ్లీ సాయంత్రం రావడం దేనికి?' అనే నా విచికిత్సకు పది నిముషాల అనంతరం వచ్చిన మా ఆవిడ మాటల్లో సమాధానం దొరికింది నాకు.

"మనం స్కూటర్ని ఇక్కడే అమ్మేసి కొత్త బండి అక్కడికి వెళ్లాక కొందామనుకుంటున్నామని బ్యాంకులో ఎవరో చెబితే వరహాలరాజుకి తెలిసిందిట. అందుకే హడావుడిగా మనింటికి వచ్చాడు. మన గుర్తుగా స్కూటర్ని అతడు కొనుక్కుంటాడట. ఐదువేలకంటే ఇచ్చుకోలేనంటున్నాడు'' అంది ఆవిడ నా ఎదురుగా కూర్చుంటూ.

"ఐదువేలా? పదివేలకు అడిగారోయ్ దానిని'' అన్నాను పేపరు పక్కన పెడుతూ.

"పోనీలెద్దురూ. మన గుర్తుగా ఉంచుకుంటానంటున్నాడు. ఇదిగో చూడండి. రెండువేలు పోసి ఈ వాచీ తెచ్చిచ్చాడు మన మీద అభిమానంతో. మహా అయితే మనకి మూడువేలు నష్టం. అంతేకదా. అయినా మీరు మరీనూ... మనం వ్యాపారం చేస్తున్నామా ఏమిటి లాభాలూ నష్టాలు చూసుకోవడానికి?''

ఆవిడ మాటల ధోరణి చూస్తుంటే 'సరే' అని చెప్పినట్లే ఉంది అతనితో. మంచి వ్యవహార దక్షతగల వ్యక్తిగా అప్పుడు గుర్తించాను వరహాలరాజుని. కార్యసాధనకు కావాల్సిన లక్షణాలన్నీ పుష్కలంగా అతనిలో ఉన్నాయనిపించింది.

ఆ సాయంత్రం వచ్చి ఐదువేలు చెల్లించి కాగితాలమీద సంతకాలు తీసుకుని స్కూటర్ తీసుకుని వెళ్లిపోయాడు వరహాలరాజు. చేసిన తప్పుని ధైర్యంగా ఒప్పుకుని అతడు మా మనస్సుల్లో మంచి స్థానం సంపాదించుకోవడం వలన తక్కువ ధరకే బండిని ఇచ్చేసినందుకు పెద్దగా బాధపడలేదు నేను.

ఆ మర్నాడు బయలుదేరిపోయాం మేం ఆ ఊరు విడిచి.

★★★

కొన్నాళ్ల తరువాత ఆ ఊరు వెళ్లవలసి వచ్చింది ఓ కోర్టు కేసు పనిమీద. చేతికి పైసా ఖర్చు లేకుండా, సెలవు నష్టపోకుండా పాత స్నేహితులందర్నీ ఒకసారి కలుసుకునే అవకాశం కలిగినందుకు నాకెంతగానో సంతోషం వేసింది.

నేను వచ్చినట్లు తెలుసుకుని చాలామంది మిత్రులు వచ్చి కలుసుకుని వెళ్లారు. వరహాలరాజు మాత్రం రాలేదు. అతనికి నేను వచ్చాననే వార్త తెలిసినట్టులేదు.

అతని షాపుకి వెళ్లడానికి నాకు కుదరలేదు. కోర్టు పని అయిపోయాక ఆ మర్నాడు హోటలు రూమ్ ఖాళీ చేసి స్టేషన్‌కు వెళ్లడానికి ఆటో కోసం ఎదురు చూస్తుంటే శ్రీనివాస్ ఎదురొచ్చాడు. అతడు పక్క ఊళ్లో టీచర్‌గా పని చేస్తున్నాడు.

మా అబ్బాయికి ట్యూషన్ చెప్పడానికి వచ్చేవాడు. స్కూటర్ స్టాండ్ వేసి వచ్చి పలకరించాడు. నేను వచ్చిన పని వివరించి స్టేషన్‌కు బయలుదేరుతున్నానని చెప్పాను.

"అలాగా? ఇక ఆటో ఎందుకు? రండి సార్. నేను డ్రాప్ చేసేస్తాను. ఇది మీ స్కూటరే" అన్నాడు.

అప్పుడు గమనించాను. అది వరహాలరాజుకి నేను అమ్మిన స్కూటరే.

"వరహాలరాజు దగ్గర నుండి అడిగి తెచ్చావా?" అన్నాను వెనుక సీటు మీద కూర్చుంటూ.

"లేదు సార్ కొన్నాను" అన్నాడు బండి స్టార్ట్ చేసి.

అతడి మాటలు విన్నాక నా మనసు కలుక్కుమంది. మా గుర్తుగా అతనివద్ద ఉంచుకుంటానన్న మనిషి ఆర్నెల్లు తిరక్కుండానే ఇంకొకరికి అమ్మేయడం కాస్త బాధ కలిగించింది.

"ఎంతకు కొన్నావేమిటి?" అప్రయత్నంగా అడిగాను.

"పన్నెండువేలకి. మీ దగ్గర పదివేలకు కొన్నాడట కదా. మరో రెండు వేలు ఖర్చు చేసి ఏవో స్పేర్‌పార్టులు మార్చాడట. అందుకని పన్నెండువేలు తీసుకున్నాడు."

నాకు మాటలు కరువయ్యాయి క్షణకాలం. తరువాత తేరుకుని 'ఔరా ఆషాఢభూతీ' అనుకున్నాను.

స్టేషన్ దగ్గర నన్ను దింపేసి ఇంట్లోనివారినందరినీ అడిగానని చెప్పమని చెప్పి శ్రీనివాస్ వెళ్లిపోయాడు.

వరహాలరాజు 'వ్యాపార నీతి'కి పణమైన స్కూటర్ని వెనుక నుండి చూస్తూ ఉండిపోయాను అది కనుమరుగయ్యేవరకు.

తక్కువ ధరకు అమ్మినందుకు నాకు బాధ కలగలేదుగానీ ఇంత చదువు చదివి కాస్తో కూస్తో అనుభవం గడించిన నేను ఒక సామాన్యుని చేతిలో ఈ విధంగా మోసపోవడం జీర్ణించుకోలేకపోయాను. బరువైన మనస్సుతో బండెక్కాను.

***

ఇంటికి చేరేసరికి మధ్యాహ్నం పన్నెండు అయింది. వరహాలరాజు చేసిన నిర్వాకం మనసును పీడిస్తూనే వుంది. ఆ విషయం శ్రీమతికి చెప్పకూడదని నిర్ణయించుకున్నాను.

'సత్యం ప్రియ హితం చయతు' అన్నాడు శ్రీకృష్ణుడు. ఎదుటివాళ్లకు ప్రియం కలిగించే సత్యాన్నే చెప్పాలి. అందువలన ఈ సత్యాన్ని నాలోనే నిక్షిప్తం చేయదలచుకున్నాను.

ఇంట్లో కూర్చుని బూట్లు విప్పుకుంటూ ఉండగా బయట నుండి లోపలకు వచ్చాడు మా అబ్బాయి చేతిలో సంచితో.

"గోడ గడియారం నడవడంలేదని అమ్మ చెబితే మెకానిక్ వద్దకు తీసుకువెళ్లాను నాన్నా. ఆ మెకానిక్ ఈ గడియారం మరి పని చేయదని చెప్పాడు. ఎందుకంటే నూటయాభై చేసే ఇటువంటి గడియారాలు ఆర్నెల్లు మాత్రమే పని చేస్తాయిట. పని చేయకపోతే దీనిని పారేయవలసిందేట. వాటి లైఫ్ ఆర్నెల్లు మాత్రమేనట" అంటున్న మా అబ్బాయిని గుడ్లు తేలేసి చూస్తూ ఉండిపోయాను.

"అదేంటి ఆ మెకానిక్ అలా అంటాడు. దాని ఖరీదు రెండువేలు కదా. నూట యాభై అంటున్నావేమిటి?" ఎప్పుడు వచ్చిందో హాల్లోకి వచ్చిన మా ఆవిడ నిట్టూరుస్తూ అంది.

"అదికాదమ్మా... స్టిక్కర్ మాత్రమే రెండువేలది. అసలు గడియారం ఖరీదు నూట యాభయ్యే" అని ఆ వాచీని నా పక్కన పడేసి వెళ్లిపోయాడు అబ్బాయి.

దానినో అంటరాని వస్తువుగా చూస్తూ ఉండిపోయాను. వరహాలరాజు 'వ్యాపార నీతి'కి అద్దం పడుతూ నన్ను వెక్కిరిస్తున్నట్లుగా ఉంది ఆ గోడ గడియారం.

★

## మూఢనమ్మకాలు

శరీర లోపాలతో పుట్టిన పిల్లలను పీకలోతు ఇసుక గోతిలో పూడ్చిపెట్టి ఆరేడు గంటల చొప్పున ఉంచితే వారి శరీరావయవాలు మామూలుగా అవుతాయన్న మూఢ నమ్మకాలు ఇంకా గుల్బర్గ ప్రాంతంలో కొనసాగుతున్నాయి. తరువాత ఆ పిల్లలను గోతుల్లోంచి తీసాక కూడా వాళ్ల అవయవాలు సరికాలేదు సరికదా ఆ హింసతో ఆ పిల్లలు ఏడుస్తున్నారు. కొందర్ని చూసయినా మిగిలినవారు బుద్ధి తెచ్చుకోకపోవడం శోచనీయం.

## చేపల్ని తినే మేక

మేకలన్నీ తింటాయి... అన్న కన్నడంలో ఒక సామెత ఉందిట. దాన్ని నిజం చేస్తోంది తుంకూర్‌కు చెందిన ఒక మేక. విచిత్రమేమిటంటే ఈ మేక ఆకులు అలములు తినదట. ప్రతిరోజూ ఐదు కేజీల చేపల్ని సునాయాసంగా తినేస్తుందిట. తన మేక గొప్పతనం గురించి ఆ మేక యజమాని అందరికీ గొప్పగా చెప్పుకుంటాడు.

## రష్యన్ ఎయిరో బేటిక్స్

ఇటీవల రష్యాలో రోస్టోల్ ఆన్ డాన్‌లో ఫ్రీస్టయిల్ మోటో క్లాస్ వరల్డ్ టూర్ ఈవెంట్ జరిగినప్పుడు మోటార్ సైకిలిస్టులు సింక్రనైజ్డ్ జంప్ చేసి చూపరుల్ని విశేషంగా ఆకట్టుకున్నారు.

-తటవర్తి

